విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ డి చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ జూన్ 19 నుంచి 24 వరకు ప్రవేశాల కొరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అలాగే ఈ నెల 26 నుంచి 30 వరకూ వెబ్ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవాలని జూలై 3 వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని. ఇక జూలై 4 వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ కళాశాలలో బి.ఎ, బి.యస్సీ, బి.కాం కోర్సులు కంప్యూటర్ సబ్జెక్ట్ తో కూడిన వివిధ రకాల గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థుల సౌలభ్యం కోసం జూన్ 19వ తేదీన మొదలయ్యే రిజిస్ట్రేషన్ నుంచి ఐచ్ఛికాల ఎంపిక వరకూ మొత్తం ప్రక్రియను ఈ కళాశాలలోనే ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంకా ఏమైనా వివరాల కోసం ఈ క్రింది ఫోన్ నంబర్లు సంప్రదించాలని 9848989823, 79815 61722 కోరారు.

నీటి సమస్యతో ప్రజల ఇబ్బందులు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో గల ముగ్గళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సమస్య ఎక్కువగా ఉన్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ద్వారా ఉదయం, సాయంత్రం ఇవ్వాల్సిన నీరు ఉదయం ఒక గంట మాత్రమే ఇస్తున్నారు అని అవి మాకు కనీస అవసరాలు తీరడం లేదు అని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటి సమస్య సుమారు రెండు మూడు నెలల తరబడి కొనసాగుతుందని అని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం జరిగినప్పుడు నీటి సమస్య ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గారి దృష్టికి తీసుకొని కూడా వెళ్ళమని త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు అని అన్నారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి విఠల్ ని వివరణ కోరగా నీటి సమస్య వాస్తవమేనని గ్రామంలో కొన్ని చోట్ల కొత్త పైప్ లైన్లు, రోడ్డు విస్తరణ పనులు వల్ల సమస్య వస్తుందని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది అని ప్రజలు ఆందోళన చెందవద్దు అని అన్నారు.

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం: వనిత

విశాలాంధ్ర-కొవ్వూరు: రాష్ట్రంలో ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రతి ఇంటికి కనీసం లక్ష నుండి పది లక్షల వరకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని హోంమంత్రి, ప్రకృతి విపత్తు నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్‌లో బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి 110వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి అందుతున్న సంక్షేమాన్ని లెక్కలతో సహా కుటుంబ సభ్యులకు ఆమె వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని, అన్ని శాఖల అధికారులను హెూంమంత్రి తానేటి వనిత ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర-ఏలేశ్వరం: సమాజంలో శాంతిభద్రతలు పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఏలేశ్వరం ఎస్ఐ జి సతీష్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన "వారధి" అనే శాంతి కమిటీ మండలంలోని పేరవరం గ్రామంలో ఏర్పాటు చేయడం ఈ సమావేశంలో ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి ఉండాలని, కుల రహిత సమాజాన్ని నిర్మించాలని, ఎటువంటి సంఘర్షణలకు గానీ ఎటువంటి విద్వేషాలకు గాని లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరూ ఉండాలని మరియు, దొంగతనాల నివారణ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్ ప్రమాదాల నివారణ పై, సైబర్ నేరాల పైన అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రజలందరికి అన్ని విషయాల పైన అవగాహన కల్పించే విధంగా ప్రొజెక్టర్ ద్వారా వీడియోస్ వేసి చూపించడం జరిగింది.

అగ్నిప్రమాద బాధితురాలికి పరామర్శ

విశాలాంధ్ర-అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం గ్రామం డిగ్రీకాలేజీ సమీపంలో గల లే అవుట్ సైట్‌లో కోళ్ల అప్పలనర్స/పాప/చెందిన నివాసపు పూరి పాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు పూర్తిగా దగ్ధం అయిన నేపథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ దేశం ఇంచార్జి వరుపుల సత్యప్రభ ఆదివారం సందర్శించి అగ్నిప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇల్లు దగ్ధంతో పూర్తిగా నిరాశ్రయులైనట్లు బాధితురాలు కన్నీటిపర్యంతమవ్వగా ఆమెను సత్యప్రభ ఓదార్చారు. వరుపుల సత్యప్రభ వ్యక్తిగత సాయంగా 5 వేలు బాధితురాలికి అందిస్తూ ప్రభుత్వపరంగా ఉచిత ఇల్లు, ఇతర సహాయం అందించడంలో అధికారులు జాప్యం లేకుండా బాధితురాలికి చూడాలని కాకినాడ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని బాధితులకు ఆమె హామీ ఇచ్చారు. సత్యప్రభ వెంట వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, కొమ్ముల తిరుమల కుమార్, యాళ్ళ జగదీశ్, ఉల్లి వీరభద్రరావు, కీర్తి వెంకట సుభాష్, జువ్విన తిరుపతి రావు, ప్రగడ మహేష్ తదితరులున్నారు.

పవన్ కళ్యాణ్ సీఎం చేయడమే మా లక్ష్యం

విశాలాంధ్ర-పిఠాపురం: పిఠాపురం మండలం కందరాడలో జనసేన నాయకులు డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆదివారం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహియాత్రను విజయవంతం చేసిన జనసేన నాయకులకు, వీర మహిళలకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అవసరమైతే పిఠాపురంలో జనసేన కార్యాలయం ప్రారంభిస్తామని అన్నారని తెలియజేశారు. అదేవిధంగా జనవాని కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చిన పలు సమస్యలు అన్ని పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందరాడ ఎంపీటీసీ పిల్లా సునీత, వెన్నపు చక్రధర్, గరగ సత్యానందరావు, పిల్లా శివ, గోపికృష్ణ, శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-అమలాపురం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా అల్లవరం మండలం ఎంట్రీకోన శివారు మొల్లి పాలెం అక్రమ రొయ్యల ఉప్పునీటి చెరువుల తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు. ఈ చెరువుల వల్ల విపరీతమైన దోమలు దుర్వాసన, ప్రజలకు తీవ్రమైన జబ్బులు బారిన పడుతున్నామన్నారు. గతంలో వీటిని ఆపివేసినా ఆదివారం ఉదయం చెరువును తవ్వడం దారుణం అంటూ గ్రామస్తులు అడ్డుపడ్డారు. ప్రభుత్వం దళిత ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఉప్పునీటి రొయ్యల చెరువులను ఆపివేయాలని కోరారు. ఈతకోట రాజు చుట్టూగుల్ల నరసింహామూర్తి, ఈతకోట నరసింహామూర్తి, కొల్లు రాంబాబు, చుట్టూగుల్ల రాజేష్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించాలి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: రాష్ట్ర ప్రభుత్వం అజలపై మోపుతున్న విద్యుత్ చార్జీల పెంపు, సర్దుబాటు చార్జీలు, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేఖంగా సీపీఐ, సీపీఎం ఆదివారం స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న ఆనం రోటరీ హాలు నందు నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి తెలుగు దేశం పార్టీ రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ శాసన సభ సభ్యులు గోరంట్ల, బుచియ్య చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయుడులు బీ.మురళిధర్, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధక్షులు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కే జోజి రౌండ్ టేబుల్ సమావేశం ఈ రౌండ్ టేబుల్ సమువేనికి హాజరైమాట్లాడారు. ఈరోజు సమావేశానికి అధ్యక్ష వర్గంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధులు సమావేశాన్ని నడిపారు. వక్తలు మాట్లాడుతూ వైసీపీ జగన్ ప్రజలపై విద్యుత చార్జీలు పెంచనని అని హామి ఇచ్చి, వైసీపీ అదికారంలోకి వచ్చిన తరువాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జిల భారాన్ని పెంచినదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రజలకు కరెంట్ బిల్లు చుడగానే షాక్ కోట్టింది అని అన్నారు.

ఇప్పటికే స్లాబులు మార్చి భారం మోపారని, ఇప్పుడు ప్రజల కళ్ళు కప్పి గత పది సంవత్సరాల కాలంలో వాడుకొని కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లి సర్దుబాటు ఛార్జిల పేరుతో పజనం నెత్తిన తాజాగా వచ్చే నాలుగు సంవత్సరాలలో 31 వేల కోట్ల భారం ప్రజలపై మోపనున్నారని తెలిపారు. ఈ మే నెల బిల్లుల్లో 2014 సంత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్లీ యూనిట్‌కు 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్తు యూనిట్ కు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంట్ యూనిట్ కు 40 పైసలు కలిపి కరిపి మొత్తం 80 పైసలు చొప్పున జనం నెత్తిన భారం మోపిన జగన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రపంచంలో కరెంటు చార్జీలు తగ్గుతున్నాయని, కానీ దేశంలో, రాష్ట్రంలో కరెంటు చార్జీలు తగ్గించాల్సింది పోయి పెంచుతున్నారని తెలిపారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానలే కారణం. అని విద్యుత్ రంగాన్ని అదాని కంపెనీ లకు కట్టబేడుతున్నారని మండి పడ్డారు. మన రాష్ట్రంలో 30 సంవత్సరాలపాటు వ్యవసాయానికి విద్యుత్ మొత్తం తయారు చేసే ఒప్పందం అదానికే ఇచ్చారని అన్నారు. విదేశాలనుండి బొగ్గు సరఫరా చేసేది, బొగ్గు రవాణా చేసే ఓడరేవులు, తాజాగా స్మార్ట్ మిట్టర్లు తయారు చేసే కంపెనీ ఆదానికి, కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడం ద్వారా మోడీ, జగన్ లు తమ జేబులు నింపుకుంటున్నారని అన్నారు. వివిధ సంఘాలు నుండి కొద్ది మంది వక్తలు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు ఎస్. ఎస్ మూర్తి, బి. పూర్ణిమరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జె.రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నాయకులు రాంబాబు, నల్లా రామారావు, ఎమ్. విజయలక్ష్మి, నిర్మల, నాయకులు రామకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.మురళి కృష్ణ, జాన విజ్ఞాన వేదిక సభ్యులు డా. చైతన్య శేఖర్, డి.జి.ప్రసాద్, జిల్లా అధ్యకులు వి. రాంబాబు, జిల్లా కార్యదర్శి ఎన్. రాజా, ఐద్వా నాయకులు బి. సుధ మరియు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, నగర ప్రముఖులు పాల్గున్నారు.

పాయింట్స్‌మన్‌లకు పదోన్నతులు

విశాలాంధ్ర-సామర్లకోట: సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న 6 గురు సిబ్బందికి (పాయింట్స్ మన్‌లకు) 60% ప్రమోషన్ కోటాలో రైల్వే గూడ్స్ గార్డ్‌లుగా పదోన్నతులు కల్పించడంతో వారిని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఘనంగా సత్కరించి 50 రోజుల ట్రెనింగ్ నిమిత్తం సికింద్రాబాద్‌లోని జోనల్ రైల్వే ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్‌కు ఆదివారం రిలీఫ్ మెమోలు అందచేసి వారిని అభినందించారు. రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కెవి గిరి,స్టేషన్ సూపరింటెండెంట్‌లు శ్రీధర్ మరియు ఆనంతలక్ష్మి, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆర్‌పిఎఫ్/ఎస్ఐ రామకృష్ణ, టికెట్ చెకింగ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బుకింగ్ ఆఫీస్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొని వారిని అభినందించి సత్కరించారు. అనంతరం సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బందితో భద్రత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు భద్రతకు సంబంధించి వచ్చే సర్క్యులర్లు క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలుపరచాలని అలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. విధినిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే తెలియచేయాలని సిబ్బందికి తెలిపారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని తన సిబ్బందిని కోరారు.

అదర్స్ ఆప్షన్ వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర-అంబాజీపేట: సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 137 మంది మహిళా పోలీసులు వివిధ కేటగిరీలలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 15వ తేదీ గురువారం కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో బదిలీల కోసం అన్ని కేటగిరీలలో దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలని జూన్ 14వ మధ్యాహ్నం సర్క్యులర్ జారీ చేసి ఉన్నారు. అయితే అదే రోజు సాయంత్రం మెడికల్, స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీలు మాత్రమే హాజరుకావాలని అదర్స్ ఆప్షన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు జూన్ 15వ తేదీన హాజరు కావద్దని ఎస్పీ కార్యాలయం నుండి సర్క్యులర్ జారీ చేసి ఉన్నారు. జూన్ 16వ తేదీన అదర్స్ ఆప్షన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కాకినాడ జిల్లా ఎస్పీ ఆఫీసుకు బదిలీల కౌన్సిలింగ్‌కి హాజరుకాగా 15వ తేదీన కౌన్సిలింగ్ పూర్తి అయిందని అధికారులు చెప్పడంతో జూన్ 16వ తేదీన ఉదయం 23 మంది మహిళా పోలీసులు వెనుదిరిగి వెళ్లిపోయారు. అదేరోజు మధ్యాహ్నం మరో 11 మంది మహిళా పోలీసులు బదిలీల కౌన్సిలింగ్కు హాజరుకాగా, వారికి కూడా కౌన్సిలింగ్ నిన్నే పూర్తి అయిందని చెప్పడంతో మహిళా పోలీసులు మాట్లాడుతూ జూన్ 15వ తేదీన అదర్స్ ఆప్షన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు హాజరు కానవసరం లేదని సర్క్యులర్లో తెలుపుగా మేము హాజరు కాలేదని, బదిలీల అదర్స్ ఆప్షన్ క్యాటగిరిలో రాంక్ వైజ్ మెరిట్‌లో ఉన్నామని మాకు కౌన్సిలింగ్ నిర్వహించకుండా, షెడ్యూల్ ప్రకారం కాకుండా వచ్చిన కొద్ది మందికి మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఎలా ఖరారు చేస్తారని ప్రశ్నించగా అడిషనల్ ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో అక్కడ సిబ్బంది మాట్లాడుతూ వారి దగ్గర నుండి రిప్రజెంటేషన్ తీసుకుని మహిళా పోలీసులను పంపించివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదర్స్ ఆప్షన్ క్యాటగిరిలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఒకేసారి కౌన్సిలింగ్ నిర్వహించి మాకు న్యాయం చేయాలని మహిళా పోలీసులు కాకినాడ జిల్లా ఎస్పీని కోరుకుంటున్నారు.

ఘనంగా "ప్లేస్మెంట్ డే-2023" వేడుకలు

విశాలాంధ్ర-గండేపల్లి: ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 18 జూన్ 2023వ తేదీన ప్లేస్మెంట్ డే-2023 వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తనికెళ్ళ భరణి ప్రముఖ సినీ కళాకారుడు, సినీ దర్శకులు మరియు రచయిత విచ్చేసారు. ఈ కార్యక్రమాన్ని 2023వ సంవత్సరంలో బి.టెక్ పూర్తి చేసుకుని ఉద్యోగాలు సాధించిన 1170కి పైగా విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించడానికి నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరక్టర్ డా ఎస్ శంభు ప్రసాద్, ప్రిన్సిపాల్ డా కె సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డా జి నరేష్, డీన్-ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా ఎం రాధికామణి, మేనేజర్ కార్పోరేట్ రిలేషన్స్ పి నాగేంద్రరావు, డిపార్ట్మెంట్ ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్స్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు మరియు ప్రెస్ & మీడియా వారు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవాసమితి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-ఆత్రేయపురం: మండలం కేంద్రంలోని రాజవరం గ్రామానికి చెందిన, తోలేటి రేవతి, సాయి (అన్నా చెల్లెలు)కు డొక్కా సీతమ్మ సేవ సమితి. రావులపాలెం వారిచే, సైకిల్, నిత్యవసర సరుకులు, ఫ్రూట్స్ ఈ సంస్థ ద్వారా అందజేయడం జరిగింది. ఈ పిల్లలిద్దరికీ చిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. వాళ్ళ అమ్మమ్మ పిల్లలు ఇద్దరినీ సంరక్షిస్తున్నారు. పిల్లలిద్దరికీ కూడా అనారోగ్యం ఈ విషయాన్ని డొక్కా సీతమ్మ సేవాసమితి వారికి నేను చెప్పడంతో వెంటనే స్పందించి ఇంతటి సహాయం చేసిన సమితి వారికి వారి కుటుంబం తరపున మరియు సుబ్బాయమ్మ సమితి వారికి ధన్యవాదాలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ సేవాసమితి సిబ్బంది మరియు బడుగు సుబ్బాయమ్మ, దసరా వంశీ బెన్ పాల్గొన్నారు.

మంగాయమ్మ మృతికి సీపీఐ, ఏఐటీయూసీ సంతాపం

విశాలాంధ్ర-కాకినాడ/ రామచంద్రపురం: కామ్రేడ్ దేవ మంగయమ్మ మృతికి రామచంద్రపురం సిపిఐ పార్టీ, ఏఐటియుసి, మరియు ప్రజానాట్యమండలి నాయకులు ప్రగాఢ సంతాపము, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కామ్రేడ్ దేవ మంగయమ్మ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కామ్రేడ్ దేవ ముసలయ్య భార్య, ఈమె హిందీ ఉపాధ్యాయులుగా పనిచేసినారు. ఆ సందర్భంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) నిర్వహించే ఉపాధ్యాయ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. రిటైర్డ్ అయిన తర్వాత మహిళా సమస్యలపై పోరాటాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నేతగా జిల్లాలో గుర్తింపు పొందారు. ఈమెకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో కుమార్తె డాక్టర్ సుజాత మరియు కుమారుడు కామ్రేడ్ దేవ రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో పనిచేస్తున్నారు. అలాంటి మహిళ, ఉపాధ్యాయ మరియు కమ్యూనిస్టు నేత అయిన దేవ మంగాయమ్మ మృతికి రామచంద్రపురం సిపిఐ పార్టీ, ఏఐటియుసి మరియు ప్రజానాట్యమండలి నాయకులు సంయుక్తంగా వారు మృతికి ప్రగాఢ సంతాపాన్ని వారు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా నరసింహారావు

విశాలాంధ్ర-కాకినాడ: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఎన్నికయ్యారు. తాడేపల్లిలో ఆదివారం జరిగిన రాష్ట్ర సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాగనరసింహారావు, ప్రధాన కార్యదర్శి బి బాలస్వామి(రుడా వైస్ చైర్మన్) కోశాధికారిగా బి శివారెడ్డి (డిప్యూటీ కమిషనర్ తాడేపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఓబులేషు(కమిషనర్ శ్రీకాకుళం) పి భవానీప్రసాద్ (కమిషనర్ జంగారెడ్డిగూడెం) కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి మల్లిఖార్జున్, ఎం ఏసుబాబు(సెక్రటరీ కాకినాడ) టి రామ్‌కుమార్, జి సృజన, సంయుక్త కార్యదర్శులుగా ఎల్ రామలక్ష్మి, కె వెంకటేశ్వరరావు, డి వెంకటరామయ్య, ఎస్‌కె ఫజులుల్లా, ఎన్ అమరయ్య, ఎన్‌వీ రమణారెడ్డి ఎన్నికయ్యారు. అలాగే వీరితోపాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులును కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

న్యాయవాదుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: ఈ నెల 25వ తేదీన విజయవాడలో రాజ్యాంగ విలువల పరిరక్షణ-న్యాయవాదుల పాత్ర నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐలాజ్ కేంద్ర కమిటీ సభ్యుడు న్యాయవాది బుగత శివ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఆయన స్వగృహం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఐలాజ్ జాతీయ కార్యదర్శి క్లిప్టన్, మాజీ న్యాయమూర్తి ఎం రాజేంద్ర, జేసురత్నం, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజ్యంగం పై దాడి జరుగుతుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడడం కోసం ఐలాజ్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బండారు నరసింహారావు, అనూహ్య, కంద వెంకటరాజు తదితర న్యాయ వాదులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చిన్నపిల్లలకూ రక్షణ లేదు

విశాలాంధ్ర-రావులపాలెం: ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని భూకబ్జాలు, లాండ్ మాఫియా, మట్టి, ఇసుక మాఫియా రెచ్చిపోతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నపిల్లలకు రక్షణ కరువైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ వంటి పారిశ్రామిక నగరంలోనే రక్షణ లేని పరిస్థితులను కనిపిస్తుండటం చూస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంకు చెందిన అమర్నాథ్ అనే విద్యార్థి హత్య గావించబడటం ఆందోళన కలిగిస్తుందన్నారు. హత్యకు గురైన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తే చాలనే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికి వదిలేసిన ఈ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలుకు రక్షణ కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తుతున్నామని ఆయన అన్నారు.

సత్యసాయి సంస్థల సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - రావులపాలెం : ఆధ్యాత్మిక చింతనతో పాటు సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని సిఆర్‌సి అధ్యక్షులు తాడి నాగ మోహన్ రెడ్డి అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన చదరంగం, ఎక్కంలు, చిత్రలేఖనం, భక్తి పాటలు, అష్టకములు, శ్లోకములు, పద్య సూక్తులు, భగవద్గీత, స్టోరీ టెల్లింగ్, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న 89 మంది విజేతలకు బహుమతీ ప్రదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వివేకానంద రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, కొవ్వూరి బ్రహ్మారెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణ రెడ్డి, చెక్క సూర్య ప్రకాష్, వెలగల హరినారాయణ రెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా పాదూరి

విశాలాంధ్ర-అనపర్తి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్ , మానిటరింగ్ కమిటీ సభ్యునిగా పాదూరి డేవిడ్ రాజు ను నియమిస్తూ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ కలెక్టర్ డాక్టర్ కె మాధవి లత ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఉత్తర్వు కాపీని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా డేవిడ్ రాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజుకు రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పొలమూరు, కొమరిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్లు సత్తి సూరారెడ్డి (ఉప సర్పంచ్), కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (కెపిఆర్ సత్తిబాబు), వైస్ ఎంపీపీ కర్రి దాసు అభినందనలు తెలిపారు.

పవన్ పర్యటన విజయవంతం చేయాలి -పితాని

విశాలాంధ్ర-ముమ్మిడివరం: వారాహి యాత్రలో భాగంగా ఈనెల 21న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముమ్మిడివరంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్చార్జ్ పితాని బాలకృష్ణ సభ ప్రాంతాన్ని పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ముమ్మిడివరంలో పవన్ కళ్యాణ్ పర్యటన విజయవంతం అయ్యేలా జనసేననాయకులు, జనసైనికులు, వీర మహిళలు, ప్రజలు ఆయన కోరారు.

కంప్యూటర్ పరికరాల బహుకరణ

విశాలాంధ్ర-అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రికి అత్యవసరమైన రూ.1.14 లక్షలు విలువ చేసే కంప్యూటర్, అనుసంధాన పరికరాలు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందించిన తాడి తమ్మిరెడ్డి (కొప్పవరం), శ్రీ విజయలక్ష్మి ఏజెన్సీస్ అధినేత నల్లమిల్లి రామచంద్రారెడ్డి చంద్రకళ దంపతులకు ఆస్పత్రి కమిటీ సభ్యులు బాల కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బాల మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రి అవసరాల కోసం అడిగిన తక్షణమే స్పందించి ఇరువురు కంప్యూటర్, అనుసంధాన పరికరాలకు ఆర్థిక సహాయం అందించడం పట్ల కమిటీ తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు.

క్రీడాప్రాంగణం ప్రారంభం

విశాలాంధ్ర-చాగల్లు: మండల కేంద్రం చాగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన కోడూరి వీర్రాజు, మరియు నాదెండ్ల శ్రీరాములు క్రీడా ప్రాంగణాన్ని రాజమహేంద్రవరం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి వర్యులు కె.ఎస్ జవహర్ ఆదివారం ప్రారంభించారు. చాగల్లు మండల టిడిపి సీనియర్ నాయకులు కరుటూరి సతీష్, జిల్లా వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రసాద్ , ఎంపీటీసీ తాంద్రు గాంధీ, మాజీ ఎంపిటిసి గన్నమని అచ్యుత పార్థసారధి, కొవ్వూరు మాజీ ఏఎంసీ చైర్మన్ వేగి చిన్నా, టిడిపి నాయకులు కొఠారు గాంధీ కోడూరి రాజేష్, నియోజకవర్గ రైతు కార్యదర్శి ముళ్ళపూడి రాము, కొడవటి మెహెర్ బాబా, నెలటూరు గ్రామ టీడీపీ నాయకులు ఎడ్లపల్లి రకారావు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ మాటలు దేనికి సంకేతం? నల్లమిల్లి

విశాలాంధ్ర-అనపర్తి: వైసీపీ సైకో మూకలు గంజాయి, మద్యం మత్తులో అనేక అమానుషాలు, నేరాలకు పాల్పడుతునప్పటికీ శాంతిభద్రతలు భద్రంగా ఉన్నాయని సాక్షాత్తు డిజిపి చెప్పడం దేనికి సంకేతం అని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం రామవరంలో నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గం రాజోలు గ్రామంలో వైసిపి అల్లరి మూకలు అమర్నాథ్ గౌడ్ అనే చిన్నారిని అమానుషంగా హత్య చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతలకు అద్దం పడుతుందన్నారు. అదేవిధంగా వైజాగ్ లో ఎంపీ కుటుంబం కిడ్నాప్, బాలుడి సజీవ దహనం, ఇటీవల కాలంలో బాలికను రేప్ చేసిన సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏ లేదా సిబిఐతో విచారణ జరిపించాలని రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

నల్లా శ్రీధర్‌కు రవణం పరామర్శ

విశాలాంధ్ర-అమలాపురం: మెగా కుటుంబానికి అత్యంత సన్నిహితులు, అమలాపురం, ప్రముఖులు నల్లా శ్రీధర్ సతీమణి నల్లా ఇంద్రాణి అకాల మరణానికి చింతిస్తూ శ్రద్ధంజాలి ఘటించిన భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు, జనసేన పార్టీ అమలాపురం మున్సిపల్ ప్రతి పక్ష నేత ఏడిద శ్రీను, రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కాత్రేనికోన: చెయ్యేరు పెట్రోల్ బంక్ సమీపంలో మోటార్ సైకిల్ పై వెళుతూ చెట్టుకు ఢీకొని ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందారు. మృతుడు పేరు నాయుడుని ఉప్పలగుప్తం మండలానికి చెందిన వాడిని స్థానికులు తెలిపారు. ఇతను తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కాత్రేనికోనలోనివాసం ఉంటున్నాడు. గున్నేపల్లి సత్తెమ్మ తల్లి ఆలయం నుండి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. నాయుడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వారాహి యాత్రకు జనసైనికులు

విశాలాంధ్ర-కరప: జనసేన పార్టీ అధ్యక్షులు కే పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లాలో వారాహి యాత్ర అన్నవరం సత్య దేవుని సన్నిధిలో పూజలు జరిపించి యాత్ర ప్రారంభించడం శ్రోతలకు విదితమే, ఇందులో భాగంగా ఆదివారం కాకినాడ రూరల్ సర్పవరంలో వారాహి యాత్ర విజయవంతం చేసేందుకు కరప మండలం నుండి జనసైనికులు వేలాదిగా తరలి వెళ్లారు. కరప మండల నాయకులు భోగి రెడ్డి కొండబాబు, భోగి రెడ్డి గంగాధర్, బండారు మురళీకృష్ణ, గంటా నాని బాబు, యాళ్ల పండు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.